# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ మాసపత్రిక

NOVEMBER 1995

# కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్

(క్రీస్తు సంఘము)

## ఆహ్వానము

## గొప్ప బైబిల్ సెమినార్

తేదీలు : 1996 జనవరి 9వ తేదీ సోమవారం నుండి
14వ తేదీ ఆదివారం వరకు

ఉపన్యాసకులు : 1. Bro. జాన్ ఫోర్డ్, U.S.A.
2. Bro. రోజర్ రైట్, U.S.A.
3. Bro. జైల్స్ హెస్టర్, U.S.A.
మరియు
4. Sis. నేన్సీ ఫోర్డ్
(స్త్రీలకు ప్రత్యేక తరగతులు నిర్వహింతురు)

సమయం : ప్రతిరోజు ఉదయం 10 గంటలకు
మధ్యాహ్నం 3-00 గంటలకు మరియు
సాయంకాలం 6-30 గంటలకు

స్థలం : KSP సెమినార్ హాలు
కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్
విద్యుత్ నగర్, కాకినాడ - 533 003

ఇండియాలో పలు రాష్ట్రముల నుండి ఈ సెమినార్ కు అనేక సోదరసోదరీలు వచ్చుచున్నారు. గొప్ప బైబిలు వర్తమానములు అందించ బడుచున్నవి. ఈ గొప్ప సహవాసములోను, ఆత్మీయ విందులోను పాల్గొనండి. దూర ప్రాంతముల వారికి ఉచిత భోజన, వసతి సౌకర్యము కలదు.

Nehemiah Gootam
Director
Ph. 0884 – 72604 Off.
64882 Res.

④ సత్యవాక్కు

THE WORD OF TRUTH
P.o. Box 80, Kakinada, A.P. 533 001
Phone : 0884-73722

Editor :
J.C. CHOATE

Managing Editor :
JOSHUA GOOTAM
Pleading for Restoration of First Century Christianity

సంపుటి 16 నవంబరు 1995 సంచిక 4

# సంపాదకీయం

## పాపము యొక్క పర్యవసానం

బైబిలు గ్రంధములోని మొదటి మూడు అధ్యాయములు ప్రపంచ సృష్టిని గూర్చి తెలియజేయుచున్నవి. అంతేకాక ఆతొలి దినములలో దేవునికి మానవునికి మధ్యగల స్పష్టమయిన సంబంధ బాంధవ్యాలను కూడ తెలియజేయుచున్నవి. దేవుడు తన స్వరూపమందు నరుని సృజించి ఆనరుని నుండి స్త్రీని నిర్మించి, ఆయిరువురిని అనగా ఆదాముహవ్వలను సుందరమయిన ఏదేను తోటలో ఉంచెను(ఆది 2:8,9). మానవునికిఅవసరమైన ప్రతివస్తువును దేవుడు ఆ తోటలో ఏర్పాటు చేసెను. తోట మధ్యనున్న మంచి చెడ్డల తెలివి నిచ్చు వృక్ష ఫలములు తప్ప మిగతా అన్ని వృక్షఫలములను తినుమని దేవుడు వారికి చెప్పెను (ఆది:2:16,17). వీటన్నిటిని బట్టి దేవునికి మానవునికి మధ్యనున్న స్పష్టమైన సన్నిహిత సహవాసము తెలుపబడుచున్నది.

ఈ చరిత్ర ఇక్కడితో ఆగిపోకుండా లోకములోనికి పాపము ఏవిధముగా ప్రవేశించేనో తెలుపబడెను. ఒక సర్పంచేసిన పని ఫలితంగా పాపము లోకంలో ప్రవేశించెను (ఆది 3:1-6). ఎట్లనగా పాపాన్ని అందముగా చూపించి తిన వద్దన్న ఫలాన్ని రమ్యంగా నోరూరుంచి ఆశపడేలా చేసింది. సర్పము "మీరు చావనే చావరు" అని అబద్దము చెప్పింది(ఆది:3:4).

ఆది కాండము 3:14-24 అంతటిలో పాపము యొక్క పర్యవసానము వివరించబడియున్నది. నేలకు తిరిగి చేరువరకు నీవు నీ ముఖపు చెమట కార్చి ఆహారము తిందువని ఆదాము అనగా పురుషుడు శపింపబడెను. వేదనతో పిల్లలను కందువు. నీభర్తయెడల నీకు వాంఛకలుగును అని హవ్వ అనగా స్త్రీ శపింపబడెను. సర్పసంతానమునకును స్త్రీ సంతానమునకును వైరము కలుగజేసెదను. ఆయన నిన్నుతల మీద కొట్టును నీవు వానిని మడిమెమీద కొట్టుదువు అని దేవుడు సర్పమును శపించెను.

## ఆత్మీయ మరణము

పాపము యొక్క భయంకరమైన పర్యవసానము ఆత్మీయ మరణము. మరణము యొక్క ఉద్దేశ్యము వేరుచేయుటే. దేవుడు ఆదినమునే తక్షణమే మానవుని ఆఏదేను తోటనుండి, ఆజీవ వృక్షమునుండి మరియు తన నుండి కూడ వేరు చేసెను. అప్పటినుండి మానవునికి దేవునికి పూర్వముండినసన్నిహిత బాంధవ్యము లేకపోయెను. పాపము వలన ఏదేను వనములో వుండే ఆనందజీవితము నాశనమాయెను. మరెన్నటికి ఆదాముహవ్వలకు ఆఏదేను మధ్యనున్న జీవ వృక్షము అందుబాటులో లేకుండెను. వారు శరీర మరణానికి లోనయిరి. నిత్యజీవితానికి, మరణమనేది లేకుండా చేయ్యగల ఆధారాన్ని వారు దూరముచేసుకున్నారు.

ఆదాము హవ్వలిద్దరూ దేవుని చిత్తాన్ని ఆజ్ఞను వ్యతిరేకించి నిషేధింపబడిన ఫలము తినుటకు ఏక పక్ష నిర్ణయము తీసుకున్నారు. వారిరువురి స్వతంత్ర నిర్ణయము వలన దేవుని సాన్నిత్యాన్ని పోగొట్టుకున్నారు.

కాలం మారుచున్నను పాపము యొక్క పర్యవసానం అప్పుడు ఎప్పుడు తరతరాలకు అంటిపెట్టుకొనేయుంది. పత్రికలలో పౌలు అంటున్నాడు : "ఒక మనుష్యుని ద్వారా పాపమును, పాపము ద్వారా మరణమును లోకములో ఏలాగు ప్రవేశించెనో, ఆలాగుననే మనుష్యులందు పాపముచేసినందున మరణము అందరికి సంప్రాప్తమాయెను " (రోమా 5 : 12). ఘోరమైన అంటువ్యాధిలాగ పాపము కూడ ఆదాము హవ్వ నుండి తరతరాలకు వ్యాపించెను. మానవుడు దేవుని నీతిని గుర్తించలేక పోవుచున్నాడు, పైగాపరలోక ఆజ్ఞలను ఎల్లప్పుడు అతిక్రమించడమే అభ్యాసము చేసుకొన్నాడు. మానవుడు పాపము చేయకుండా వుండాలి. అయితే అతడు దానినే ఎన్నుకుంటున్నాడు. అందరూ పాపము చేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారని (రోమా 3 : 23) వాక్యము చెబుతుంది. సూర్యుని క్రింద జరిగే ప్రతిదుష్కార్యము వ్యభిచారము, దొంగతనము, అబద్దము, బాధ, నరహత్యలు - యిటు వంటివి ఎన్నో పాపాన్ని తిరిగి చూపిస్తున్నాయి. మన మధ్యనున్న ప్రతి స్మశాన వాటిక పాపము యొక్క శక్తిని దాని పర్యవసనాన్ని నిరంతరము మనకు తెలియజేస్తుంది.

## క్రీస్తులో జీవము

అయితే దేవుడు ఏదేను తోటలో మనకు ఒక ఆశను, అవకాశాన్ని చూపించాడు. "స్త్రీ సంతానము ఆ సర్పము యొక్క తల మీద కొట్టును" (ఆది : 3: 15). ఇది మానవుడు పాపము నుండి మరణము నుండి తప్పించుకొనే

ఒకే ఒక మార్గమును దేవుడు సూచించాడు. మానవుడు హృదయ పూర్వకంగా తన తండ్రియైన దేవుని సన్నిధికి తిరిగి చేరాలని కోరుకుంటే ఆ పనిని (సర్పము తలను కొట్టుట) చేయగల సమర్ధుడే. ఈ వాగ్దానము అవకాశము క్రీస్తు నందు సంపూర్ణము చేయబడెను. "మనుష్యుని ద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానము కలిగెను. ఆదాము నందు అందరు ఏలాగు మృతిపొందుచున్నారో ఆలాగుననే క్రీస్తు నందు అందరు బ్రతికింప బడుదురు " (1 కొరింధి 15 : 21, 22). "దేవుని కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులుగా చేయును " (I యోహాను 1 : 7). పాపము యొక్క పర్యవసాన మేదనగా పాపరహితుడు, నిర్దోషి అయిన దేవునికుమారుడు క్రీస్తు సిలువ పై మరణించుట. యేసు క్రీస్తు నందు విధేయులైన వారి కందరికిని నిత్యరక్షణకు కారకుడాయెను. (హెబ్రీ 5:9)

క్రీస్తు రక్తము ద్వారా రక్షింపబడాలంటే ఆయన ఆజ్ఞలను సమ్మతించాలి. క్రీస్తును విశ్వసించని యెడల మానవులు పాపములలో నే యుండి మరణింతురు (యోహాను 8 : 24). మానవుడు మారు మనస్సు పొందాలి. తన పాపస్థితి నుండి దేవుని తట్టు తిరగాలి. యేసు క్రీస్తే ప్రభువని ఒప్పుకోవాలి (లూకా : 13 : 3, మత్తయి 10 : 32,33, రోమా. 10 : 10). బాప్తిస్మము పొందుట వలన పాపములు కడుగబడి నూతన జీవము పొందుదురు (అకార్య 2 : 38;22 : 16, రోమా 6 : 3,4). ఇట్లు చేయుట వలన పాప విషయములో చనిపోయి క్రీస్తులో జీవింతుము (రోమా 6 : 5-8). క్రీస్తు ద్వారానే పాపము యొక్క పర్యవసానము నుండి విముక్తి పొందగలము.

# అద్భుతమైన పరిశుద్ధగ్రంథము

## (The Bible is wonderful)

బైబిలు అద్భుతమైన గ్రంథము. అది క్రైస్తవ మతానికి బలమైన పునాది. అది మానవ హక్కుల విషయములో మాగ్నకార్టావంటిది. అది అమాయకత్వము నుండియు,మూఢత్వమునుండియు స్వతంత్రము కల్పించుచున్నది. అది మానవ ఆత్మలను బంధములనుండి తొలగించునది. బైబిలునకు సంబంధించి 4 వ్యక్తులు ముఖ్యముగా కనబడుచున్నారు. వారెవరనగా "జాన్‌విక్లఫ్" బైబిలు అనువాదకుడు. "జాన్‌హస్" బైబిలు చదువుట హక్కుగా భావించి హతసాక్షియైనవాడు. జోహనీస్ గూటెన్‌బర్గ్ మొదట సారిగా బైబిలు బోధకుని మర్మాన్ని చెప్పినవారు.

దైవ సంబంధిత అనుభవాల్ని కలిగిన బైబిలు నిజముగా ఒక అద్భుత గ్రంధము. దీనిని దేవునిచేత పరిశుద్ధులుగా ఎంచబడినవారు పరిశుద్ధాత్మచేత ప్రేరేపింపబడి వ్రాసిరి (2పేతురు1:21). లేఖనములన్నియు దైవావేశము వలన కల్గినవి (2తిమోతి 3:16).

బైబిలు నిత్యము క్రొత్తదనాన్ని కల్గి యుండి అద్భుతమైన దానిగా కనబడుచున్నది. బైబిలును చదివి దానిలోని సత్యాన్ని గ్రహించునపుడు మానవుడు అలసి పోడెందుకు? ఎందుకంటే అది తరగని సంపదలు కలిగిన ఒక గని వంటిది. అది ఎప్పటికీ ఎండని ఒక జలధార వంటిది. అది ఏలియాకు ఆహారమునిచ్చిన విధవరాలి యొక్క నూనెయు పిరెడియునై యున్నది. కొన్నివందలసంవత్సరముల నుండి దాని నుండి వెలకట్టలేనటువంటి సంపదలను మానవుడు పొందుచున్నప్పటికి అది యింకనూ క్రొత్తదనాన్ని కలిగి నూతనముగ

కనబడుచున్నది. అది మరే యితర పుస్తకము లేదా గ్రంధము గానీ చదువబడలేనంత సూక్ష్మముగా చదువబడినది. దాని మీద వేలకొలది వ్యాఖ్యానములు వ్రాయబడినవి. దానిలోనున్న పుస్తకముల నుండి కోట్లకొలది ప్రసంగములు చేయబడినవి. ఆదిమ బైబిలు ఎప్పటికి తరుగనటువంటి ఒక గని వంటిది. అది జీవము కలిగిన ఒక రొట్టెవంటిది. దానిని ప్రతిరోజు ఎన్ని ముక్కలుగా కోసికొని మనము తిన్నప్పటికి అది తరుగక యింకనూ మిగిలి వుంటుంది. మానవుని క్రియలు నిష్ప్రయోజనములై పనికి రాకుండా పోవచ్చును గాని బైబిలు నందున్న క్రియలు అక్షరాలా జరుగును.

సమైక్యతను చూపుటలో బైబిలు అద్భుతమైన గ్రంధముగా నున్నది. అది వ్రాయబడడానికి కల్పించబడ్డ ప్రత్యేకమైన పరిస్థితులు కూడా సమైక్యతను చూపుతూ అద్భుతముగా నున్నది. బైబిలు సుమారు రెండు ఖండముల మీద, కనీసము మూడు భాషలలో వ్రాయబడినది. అది పూర్తిగా వ్రాయబడడానికి సుమారు **1600** సంవత్సరముల కాలంలో **40**మంది విభిన్న గ్రంధకర్తలు పని చేయవలసివచ్చినది. అది రకరకములైన పరిస్థితులలో వ్రాయబడెను. గుడారములలో, ఎడారులలో, పట్టణాలలో, భవంతులలో, కందకములలో, అపాయకరమైన పరిస్థితులలో, సంతోషకరమైన పరిస్థితులలోను వ్రాయబడినది. ఐనప్పటికీ బైబిలునందలి వివిధ భాగములను కలిపినప్పుడు ఎటువంటి అరమరికలు లేకుండా ఒక భాగముతో మరియొకటి సంబంధము కలిగి యుండెను. ఇది ఎట్లు సంభవము? లేదా ఎట్లు ఎలా సాధ్యము? దానికి ఒకటే సమాధానము కలదు. "దేవుడే దీనికంతటికి మూలకారణమై యున్నందున ఇది సాధ్యపడినది".

ప్రపంచములో బైబిలుకున్నట్టి పలుకుబడిని గమనించినపుడు అది కూడా అద్భుతముగానే తోచుచున్నది. బైబిలుకున్న పలుకుబడి చేత మానవుడు ఉన్నతమైన స్థాయికి చేరుకొనగలిగాడు. బీదలను అణుగద్రొక్కుట, బానిసత్వమనేది పూర్తిగా తగ్గిపోయినవి. స్త్రీలకు ప్రాముఖ్యత కల్పించబడినది. నీతి, నిజాయితీలు పెరిగినవి, నియంతృత్వము తొలగించబడినది. విద్యావకాశములు కల్పించబడినవి, నిరక్షరాస్యత నిర్మూలించబడినది. నాగరిక ప్రపంచాన్ని తయారు చేయుటలో మనుష్యులందరూ చేసిన కృషి కంటే బైబిలే ఎక్కువ కృషి చేసెను. సంగీత సంబంధమైన వాటి విషయములలో బైబిలు యొక్క పలుకుబడిని తొలగించి చూచినప్పుడు ఆ సంగీతము నిర్వీర్యముగా వినబడును. అదే విధముగా కావ్య సంబంధమైన వాటి విషయములలో బైబిలు పలుకుబడిని తొలగించి చూచినప్పుడు ఆ కావ్యము సొంపులేని కావ్యముగా కనబడును. చిత్రకళయందు బైబిలు పలుకుబడి లేనప్పుడు ఆ చిత్రకళ నిస్తేజముగా ఉండును. బైబిలు సిద్ధాంతముల మీద ఆధారపడిన గ్రంధములను తొలగించినపుడు నాగరికత క్షీణించిపోవును. అదే విధముగా బైబిలు మీద ఆధారపడి వ్రాయబడిన గ్రంథములను గ్రంథాలయముల నుండి తొలగించినపుడు మంచి గ్రంధపఠనము మనకు లేకుండా పోవును. అందుచేత బైబిలు చాలా అద్భుతమైనది. దాని యొక్క ప్రభావము సంఘములో చాలా ఎక్కువగా నున్నది.

దావీదు ఇట్లనుచున్నాడు : "నీ ఉపదేశము వలన నాకు వివేకము కలిగెను. తప్పు మార్గములన్నియు నాకసహ్యములాయెను. నీ వాక్యము నాపాదములకు దీపమును నా త్రోవకు వెలుగునైయున్నది...నీ వాక్యములు వెల్లడి అగుటతోడనే వెలుగు కలుగును. అవి తెలివి లేని వారికి తెలివికలిగించును" (కీర్తన 119:104,105,130).

---రోయ్ బీస్లే.

# పేతురు పోప్పై యున్నాడా ?

## (Was Peter a Pope?)

యేసు తన సంఘముపై పోపును నియమించు అధికారమును ప్రజలకు యిచ్చినట్లు ఆయన బైబిలు నందు చెప్పెనా? మతసంబంధమైన ఏ ప్రశ్నయైననూ మనము తప్పక మొదట బైబిలును చదివి ఆ ప్రశ్నను పరిశీలించాలి (1 థెస్స 5 :21;II యోహాను 9). మరియు ప్రేమతో సత్యమును మాట్లాడవలెను (ఎఫెసీ 4 : 15).

## కథోలిక్ వారి వాదన

పేతురు తమ మొదట పోప్ అని, మరియు పారంపర్యముగా ఆక్రమములోనే నేటి వరకునూ పోప్‌లు అందరూ ఎన్నిక చేయబడుచున్నట్లు కేథలిక్ వారు బోధించుచున్నారు. పోపు భూమిపై సంఘమునకు శిరస్సని వారి వాదన. కథోలిక్ సంఘము పేతురు పైనే కట్టబడినదని బోధించుచు దానికి ఆధారముగా మత్తయి 16 : 18 వాక్యమును చూపుచున్నారు. గనుక మనము మత్తయి 16 : 13-19, మరికొన్ని యితర లేఖనములను చదివి వారి బోధనలను పరిశీలింతము.

"యేసు పిలిప్పుదైన కైసరయ ప్రాంతములకు వచ్చి - మనుష్య కుమారుడెవడని జనులు చెప్పుకొనుచున్నారని తన శిష్యులను అడుగగా వారుకొందరు బాప్తిస్మమిచ్చు యోహాననియు, కొందరు ఏలీయా అనియు, కొందరు యిర్మీయా అనియు లేక ప్రవక్తలలో ఒకడనియు చెప్పుకొనుచున్నారనిరి. అందుకాయన - మీరైతే నేను ఎవడనని చెప్పుకొనుచున్నారని వారి నడిగెను. అందుకు సీమోను పేతురు నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని

చెప్పెను. అందుకు యేసు - సీమోను బర్‌యోనా, నీవు ధన్యుడవు, పరలోకమందున్న నా తండ్రి ఈ సంగతి నీకు బయలుపరచెనే కాని నరులు నీకు బయలు పరచలేదు. మరియు నీవు పేతురువు ; ఈ బండ మీద నా సంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువనేరవని నీతో చెప్పుచున్నాను. పరలోకరాజ్యము యొక్క తాళపుచెవులు నీకిచ్చెదను, నీవు భూలోకమందు దేని బంధించుదువో అది పరలోకమందును బంధింపబడును, భూలోకమందు దేని విప్పుదువో అది పరలోకమందును విప్పబడునని అతనితో చెప్పెను" (మత్తయి 16 : 13 - 19).

పేతురు యేసును ఒప్పుకొనెను. దేవుని శక్తి చేత యేసు చేసిన అద్భుతములను పేతురు చూచెను. యేసు యొక్క ఆశ్చర్యకరమైన బోధలను వినెను. మరియు ఆయన యొక్క పాపరహిత, నిస్వార్థ జీవితమును చూచెను. యేసే "క్రీస్తు" (అభిషిక్తుడు) అని, ఆయన సజీవుడైన దేవుని కుమారుడనియు పేతురునకు తెలియును. యేసును ఒప్పుకొనుటకు పేతురు సిగ్గుపడలేదు.

యేసు పేతురును ఒప్పుకొనెను. "మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోకమందున్న నాతండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందును. మనుష్యుల యెదుట ఎవడు నన్ను ఎరుగననునో వానిని పరలోకమందున్న నాతండ్రి యెదుట నేనును ఎరుగనందును"(మత్త 10:32-33) అని యేసు వాగ్దానము చేసెను. అందును బట్టి పేతురు యేసును ఒప్పుకొనిన తరువాత "మరియు నీవు పేతురువు" అని చెప్పుట వలన యేసు తన వాగ్దానమును నెరవేర్చెను.

"ఈ బండ మీద" నా సంఘమును కట్టుదునని యేసు వాగ్దానము చేసెను. పేతురు అనగా రాయి అని అర్థము. ఈ బండ మీద అనగా "పేతురు మీద" అని కథోలిక్ సంఘము బోధించుచున్నది. కాని యేసు ఆలాగున

బోధించలేదు. అయితే క్రొత్త నిబంధన గ్రీకు భాషలో వ్రాయబడినదని జ్ఞాపకము చేసికొనుట అవసరము. "పేతురు" అనేమాట "పెట్రాస్" (Petros) అనే గ్రీకు పదము నుండి తర్జుమా చేయబడినది. పెట్రాస్ పురుషలింగము. "బండ" అను పదము "పెట్రా" (Petra) అనే గ్రీకు పదమునుండి తర్జుమా చేయబడినది. పెట్రా స్త్రీ లింగమై యున్నది. పెట్రా (బండ)అనగా పెద్ద రాయి, బండ లేక పాషాణము. "... ఈ బండ మీద నా సంఘమును కట్టుదును.....' యేసు ఏ బండ మీద తన సంఘమును కట్టెనో అది పేతురు కంటెను మరియు యే ఇతర వ్యక్తి కంటెను కూడ గొప్పదైయున్నది. యేసు తన సంఘమును కట్టిన బండ యేదనగా "సజీవుడగు దేవుని కుమారుడైన క్రీస్తువు" అని పేతురు యేసుతో ఒప్పుకొనిన వాస్తవమే. "వేయబడినది తప్ప, మరియొక పునాది ఎవడును వేయనేరడు; ఈ పునాది యేసుక్రీస్తే" (1 కొరింథి 3:11).

పరలోక రాజ్యపు తాళపు చెవులు పేతురునకు ఇచ్చెదనని యేసు వాగ్దానము చేసెను. గనుక భూమిపై దేనినైననూ బంధించుటకును, విప్పుటకును పేతురు పరలోకపు అధికారమును పొందెను. ఈ అధికారము అపొస్తలులందరికి చెందునని యేసు చెప్పెను. "భూమి మీద మీరు వేటిని బంధింతురో, అవి పరలోకమందును బంధింపబడును; భూమి మీద మీరు వేటిని విప్పుదురో అవి పరలోకమందును విప్పబడునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (మత్తయి 18:18). దీని భావము అపొస్తలులు తమకిష్టమైన బోధలను చేయవచ్చునని కాదు; గాని యేసు పరమునకు వెళ్లుటకు ముందు అపొస్తలులకు యేసు ఇట్లు చెప్పెను. " అయితే ఆయన, అనగా సత్య స్వరూపియైన ఆత్మ వచ్చినపుడు మిమ్మును సర్వసత్యము లోనికి నడిపించును. ఆయన తనంతట తానే యేమియు బోధింపక, వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును" (యోహాను 16:13). యేసు పునరుత్థానుడైన తరువాత అపొస్తలుల కార్యములు 2వ అధ్యాయములో

పేతురు మరియు మిగిలిన అపొస్తలులు మొదటిసారిగా సువార్త ప్రకటన చేయుచు పరలోకరాజ్యపు తాళపు చెవులను ఉపయోగించుట ప్రారంభించిరి. కావున యేసు తన సంఘమును పేతురు పై కట్టినట్లు గాని లేక పేతురును 'పోపు'గా నియమించినట్లు గాని మత్తయి 16:18 లో ఆయన బోధించలేదు.

## పేతురు పోపు కాదు

పేతురు వివాహితుడు. కథోలిక్ సంఘము తమ పోపు వివాహము చేసికొనుటకు అనుమతించదు. కాని అపొస్తలుడైన పేతురునకు భార్య కలదు. "తరువాత యేసు పేతురింటిలో ప్రవేశించి జ్వరముతో పడియున్న అతని అత్త (భార్య తల్లి) ను చూచి ...." (మత్తయి 8:14, మార్కు 1:30, లూకా 4:38). అపొస్తలుడైన పౌలు వివాహము చేసికొనలేదు గాని వివాహము చేసికొనుటకు అధికారము కలదని ఆయన మాటలలో గ్రహించగలము. "తక్కిన అపొస్తలుల వలెను, ప్రభువు యొక్క సహోదరుల వలెను, కేఫా వలెను విశ్వాసురాలైన భార్యను వెంటబెట్టుకొని తిరుగుటకు మాకు అధికారము లేదా?" (1 కొరింథి 9:5). పేతురును కేఫా అని పిలిచినట్లు యోహాను 1:40 -42లో చూడగలము. పై లేఖనములు పేతురు వివాహితుడని తెలియజేయుచున్నవి. ఇందును బట్టి పేతురు కథోలిక్ పోపులకుండు అర్హతలలో ఒకదానికి లోబడి యుండలేదని తెలియుచున్నది. విశ్వాసము నుండి తొలిగిపోయిన కొందరు అనుసరించు బోధలలో వివాహమును నిషేధించుట ఒకటని I తిమోతి 4:1-3 లో అపొ॥పౌలు ముందుగనే చెప్పెను.

తన యెదుట మానవులు సాగిలపడుటను పేతురు తిరస్కరించెను. అయితే కథోలిక సంఘ 'పోపు' ప్రజలకు తన యెదుట మాట్లాడుచూ ఏమి చెప్పెనో ఈ సందర్భములో ఆలోచించుదము. "పేతురు లోపలికి రాగా

కొర్నేలీ అతనిని ఎదుర్కొని అతని పాదముల మీదపడి నమస్కారము చేసెను. అందుకు పేతురు నీవు లేచి నిలువుము, నేను కూడ నరుడనే ..... " (అపొ॥కా॥10:25-26). భూమి పై ఏ మానవుని లేక విగ్రహమును మనము పూజింపరాదు. మత్తయి 4:10 లో "....ప్రభువైన నీ దేవునికి మ్రొక్కి ఆయనను మాత్రము సేవింపవలెను...." అని యేసు చెప్పెను. పేతురు ఎవరి చేతను పూజింపబడుటకు యిష్టపడి యుండలేదు. గావున మనుష్యుల చేత మతసంబంధముగా పూజలందుకొనుచున్న పోపులలో చేరినవాడు కాడు.

మొదటి శతాబ్దపు క్రైస్తవులు పేతురును ఒక పోపుగాగౌరవించి యుండలేదు. అపొ.కా. 11:3లో యూదుల నుండి క్రైస్తవులయిన వారు పేతురును అన్యులతో కలసి భోజనము చేసినందుకు నిందించిరి.అప్పుడు పేతురు యేసుక్రీస్తు ద్వారా నిత్యజీవము పొందుటకు అన్యులను కూడ దేవుడు పిలిచి యున్నాడని వారికి బోధించెను (అపో.కా.11:4-18). దేవునికి భయపడక మనుష్యులకు భయపడి వెనుకతీసి వేరైనందుకు పేతురును అపొ॥పౌలు గద్దించెను (గలతి 2:11-12). (అపొస్తలులు తమ బోధయందు దోషరహితముగానుండుటకు దేవుడే కారణము. అయిననూ వారు తమ ప్రవర్తన యందుపడిపోవు అవకాశము కలదని గ్రహించుదము. 1కొరింథి 9:27 చూడుము). పేతురును నిందించుటలో క్రైస్తవులు చూపిన ధైర్యము వారతనిని పోపుగా గౌరవించుటలేదని తెలియుచున్నది.

## అపొస్తలులందరు అధికారములో సమానులే

అపొస్తలులందరిలో పేతురు ముందుండేవాడనునది నిశ్చయము. పేతురు శీఘ్రముగా మాట్లాడుచూ మంచి నాయకత్వ సమర్థత కలిగినవాడు. అయిననూ వీటిని బట్టి పేతురు అందరికంటె ఎక్కువ అధికారము గలవాడని కాదు.

వాస్తవమునకు ఒక సందర్భములో అపొస్తలులు పేతురును మరియొక అపొస్తలుని సంఘమును బలపరచుటకు పంపించిరి. "సమరయ వారు దేవుని వాక్యము అంగీకరించిరని యెరుషలేములోని అపొస్తలులు విని పేతురును యోహానును వారి యొద్దకు పంపిరి" (అపో కా. 8:14). "దాసుడు తన యజమానుని కంటె గొప్పవాడు కాదు, పంపబడినవాడు తన్ను పంపిన వానికంటె గొప్పవాడు కాడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహాను 13:16). యేసు చెప్పిన మాటలను బట్టి పేతురు, యోహాను తమను సమరయకు పంపిన మిగిలిన అపొస్తలుల కంటె గొప్పవారు కాదని తెలియుచున్నది. క్రింది లేఖనములు కూడ అపొస్తలులందురు సమానులేనని తెల్పుచున్నవి. (మత్తయి 19:28, అపొ॥కా॥2:42, II కొరింథి 12:11-12).

## పేతురు మొదటి పోపు అనుట మానవ సాంప్రదాయము

పేతురు రోమాకు వెళ్లి మొదటి పోపు ఆయెనని కథోలిక సంఘము బోధించుచున్నది. కాని క్రొత్త నిబంధన ఆలాగున బోధించుటలేదు. పారంపర్యాచారములు ఒకడు దేవునికి విధేయుడు కాకుండునట్లు చేయునని యేసు చెప్పెను. "అందుకాయన- మీరును మీ పారంపర్యాచారము నిమిత్తమై దేవుని ఆజ్ఞను ఎందుకు అతిక్రమించుచున్నారు? " (మత్తయి 15:3) అని యేసు వారిని గద్దించెను. ఏ విధమైన పారంపర్యాచారములు మనపై అధికారము చూపుటకు మనము అనుమతించరాదు.

పోప్ అను బిరుదును ధరించుట యేసు ఆజ్ఞను తిరస్కరించుటయే. మత సంబంధముగా "తండ్రి" అను బిరుదును ధరించుటను గూర్చి యేసు ఈలాగున చెప్పెను. "మరియు భూమి మీద ఎవనికైనను తండ్రి అని పేరుపెట్టవద్దు; ఒక్కడే మీ తండ్రి; ఆయన పరలోకమందున్నాడు." (మత్త

23:9). "పోప్" అనగా "తండ్రి" అని అర్థము. కేథలిక్ సంఘ పోపును ఆయన అనుచరులు తరచుగా "పరిశుద్ధ తండ్రి" అని పిలుచుచున్నారు. యేసు క్రీస్తు ఆజ్ఞను తిరస్కరించి అట్టి బిరుదును ఎన్నడూ పేతురు ధరించి యుండలేదు.

## పేతురు ఎన్నడూ తానొక పోపునని చెప్పుకొనలేదు.

"యేసుక్రీస్తు అపొస్తలుడను" అని తప్ప మరి ఏ విధమైన బిరుదులు పేతురు ధరించియుండలేదు. (1 పేతురు 1:1, 11 పేతురు 1:1).

క్రీస్తే తన సంఘమునకు శిరస్సు. క్రీస్తు సంఘమునకు భూమిపైన ఒకరు, పరలోకమందు మరియొకరు శిరస్సులు గా లేరు. తన సంఘమునకు భూమిపై పేతురు లేక మరి ఏ యితర వ్యక్తిని శిరస్సుగా యేసు నియమించి యుండలేదు. యేసు పరలోకమునకు ఆరోహణమయిన తరువాత పౌలు ఈలాగున చెప్పెను:

"సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు; ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగు నిమిత్తము, ఆయన అదిగాయియుండి మృతులలోనుండి లేచుటలో ఆదిసంభూతుడాయెను." (కొలస్స 1:18). దేశ స్థాయిలోగాని లేక ప్రపంచస్థాయిలో గాని భూమిపై సంఘమునకు ముఖ్య కేంద్రములను ఏర్పరచుకొనుటకు మనుష్యులకు అధికారము లేదు. క్రీస్తు సంఘమునకు శిరస్సు అయిన క్రీస్తు పరలోకమందుయున్నారు. మరియు ముఖ్యకేంద్రము కూడ అచ్చటనే యున్నది. స్థానిక సంఘము భూమిపైన ప్రాంతీయ జాతీయ మరియు అంతర్జాతీయ సంస్థలకు జవాబు దారి కాదు. ప్రతీ స్థానిక సంఘము యేసు యొక్క, క్రొత్త నిబంధనలోని ఆత్మపూర్ణులయిన లేఖికుల యొక్క ఆజ్ఞలకు లోబడవలెను. క్రీస్తుకు లోబడిన స్థానిక సంఘమే క్రీస్తుసంఘము. ఏ స్థానిక సంఘమైను మానవ బోధలకు, అధికారమునకు లోబడినచో ఆ

సంఘము మనుష్యులదే కాని క్రీస్తుది కాదు.

మతాధికార విషయములలో నీవు క్రీస్తు యొక్క క్రొత్త నిబంధనకు లోబడుచున్నావా? లేక మనుష్యుల బోధలు మరియు ఆజ్ఞలకు లోబడుచున్నావా?

-- రోయస్ ఫ్రెడరిక్.

కొండమీద ప్రసంగము - 17

## ప్రమాణము చేయుటనుగూర్చి

## JESUS TEACHING REGARDING OATHS ETC

### (మత్తయి 5:33-37)

యేసు ప్రభువు మత్తయి 5:33-37 లో యిట్లు బోధించారు: "నీవు అప్రమాణము చేయక నీ ప్రమాణములను ప్రభువునకు చెల్లింపవలెనని పూర్వీకులతో చెప్పబడిన మాట మీరు విన్నారు గదా, నేను మీతో చెప్పున దేమనగా- ఎంత మాత్రము ఒట్టు పెట్టుకొనవద్దు; ఆకాశము తోడనవద్దు; అది దేవుని సింహాసనము. భూమి తోడన వద్దు, అది ఆయనపాద పీఠము. యెరూషలేముతోడన వద్దు, అది మహారాజు పట్టణము. నీతలతోడని ఒట్టు పెట్టుకొనవద్దు, నీవు ఒక వెంట్రుకనైనను తెలుపుగా గాని నలుపుగాగాని చేయలేవు. మీ మాట అవునంటే అవును, కాదంటేకాదు అని యుండవలెను; వీటికి మించునది దుష్టుని నుండి పుట్టునది."

యూదులు ప్రమాణములు చేయుటకు అలవాటుపడిన వారు. కొన్ని చట్టసంబంధమైన ప్రమాణములు మరికొన్ని మతసంబంధమైన ప్రమాణములు వారికి ఉండేవి. "ఒకడు యెహోవాకు మ్రొక్కు కొనిన యెడల లేక, తాను

బద్ధుడగుటకు ప్రమాణము చేసిన యెడల, అతడు తన మాట తప్పక తన నోటనుండి వచ్చిన దంతయు నెరవేర్చవలెను" అని మోషే చెప్పి యున్నాడు (సంఖ్యా 30:2). ద్వితీ 23:21 మరియు ప్రసంగి 5:2-5 వరకు దయచేసి చదువండి. మరల "నీదేవుడైన యెహోవా నామమును వ్యర్థముగా నుచ్చరింపకూడదు; యెహోవా తన నామమును వ్యర్థముగా నుచ్చరింపువానిని నిర్దోషిగా ఎంచడు" అనునది పది యాజ్ఞలలో ఒకభాగమైయున్నది (నిర్గమ 20:7). పాతనిబంధనకాలములో ప్రజలు వ్యర్థ ప్రమాణములు చేయరాదని చెప్పబడినది. ఒకవేళ వారు ప్రమాణము చేసినా, మ్రొక్కు కొనినా వాటిని నెరవేర్చాలని తీవ్రంగా హెచ్చరింపబడినది.

## అబద్ధ ప్రమాణము చేయవద్దు

నీవు అప్రమాణము చేయవద్దని యేసుప్రభువు చెప్పారు. అంటేనీవు అబద్ధ ప్రమాణము చేయవద్దని ఆయన అభిప్రాయము. మరియు దేవుని నామమును వ్యర్థముగా నుచ్చరించకూడదను ఆజ్ఞను యూదులు ఎరిగియే యుండిరి. శాస్త్రులు, పరిసయ్యులు ప్రమాణము చేసినవాడు దేనిని బట్టి ప్రమాణము చేసాడో దానిని బట్టి ఆ ప్రమాణమును అతడు నెరవేర్చాలో వద్దో నిర్ణయించేవారు. యేసుప్రభువు వారి ఆచారములను ఖండించారు: "అయ్యో అంధులైన మార్గదర్శకులారా, ఒకడు దేవాలయము తోడని ఒట్టు పెట్టుకొంటే అందులో ఏమియులేదుగాని, దేవాలయములోని బంగారముతోడని ఒట్టుపెట్టుకొంటెవాడు దానికి బద్ధుడని మీరు చెప్పుదురు.. ఏది గొప్పది? బంగారమా?బంగారమును పరిశుద్ధపరచు దేవాలయమా? " (మత్తయి 23:16-22). అబద్ధ ప్రమాణము దేవుని పేరిటచేసినను, పరిశుద్ధ వస్తువులను బట్టి చేసినను అది అబద్ధ ప్రమాణమేయగును. అందువలన యేసుశిష్యులు అప్రమాణము చేయక ఎల్లప్పుడు సత్యమునే చెప్పవలెనని ఆయన బోధించారు.

వారిమాట అవునంటే అవునని, కాదంటే కాదని ఎల్లవేళలా యుండాలి. గాని వారిమాటల యదార్థతను నమ్మించడానికి వారు దేవుని నామాన్ని బట్టి ఒట్టు పెట్టుకోనక్కర్లేదు.

యేసు ప్రభువు మాటలనే ఇంచుమించుగా భక్తుడైన యాకోబు వ్రాసాడు: "నా సహోదరులారా, ముఖ్యమైన సంగతి ఏదనగా, ఆకాశము తోడని గాని, భూమితోడని గాని, మరిదేనితోడని గాని ఒట్టు పెట్టుకొనక, మీరు తీర్పు పాలు కాకుండునట్లు అవునంటే అవును, కాదంటే కాదు అని ఉండవలెను" అని అతడు వ్రాసాడు (యాకోబు 5:12). క్రైస్తవులు ఎల్లవేళలా సత్యాన్నే చెప్పాలి. అంతకు మించిగాని లోపించిగాని యుండునది దుష్టునినుండి పుట్టునది. దేవుని నామమును బట్టి ప్రమాణము చేయుట బహిష్కరింపబడలేదుగాని, ఏరకమైన ప్రమాణము అవుసరం లేనంతగా క్రైస్తవులు ఎల్లవేళలా సత్యమునే చెప్పాలని యేసు ప్రభువు యొక్కయు, యాకోబు యొక్కయు భావమై యున్నది.

పాతనిబంధన కాలంలో ఇశ్రాయేలీయులు, "నీ దేవుడైన యెహోవాకు భయపడి ఆయనను సేవించి ఆయన పేరట ప్రమాణము చేయవలెను" అని ఆజ్ఞాపింప బడిరి (ద్వితీ 6:13, 10:20). అది అట్లుండగా దేవుడు "నానామమును బట్టి అబద్ధ ప్రమాణము చేయకూడదు; నేను యెహోవాను" అని వారిని హెచ్చరించెను (లేవీ 19:12).

అప్రమాణము చేయుటను దేవుడు ఖండించాడు. అది దేవుని యెడల చూపు భయంకర భక్తిహీనత యగును. అప్రమాణము చేయువాడు దేవుని నామమును వ్యర్థముగా నుచ్చరించిన వాడగును. దావీదు ఇట్లనుచున్నాడు: "యెహోవా పర్వతమునకు ఎక్కదగిన వాడెవడు? ఆయన పరిశుద్ధ స్థలములో నిలువదగిన వాడెవడు? వ్యర్థమైన దానియందు మనస్సు పెట్టకయు, కపటముగా

ప్రమాణము చేయకయు, నిర్దోషమైన చేతులును శుద్ధమైన హృదయమును కలిగి యుండువాడే' (దా. కీర్త 24:3,4). దేవుని నామమును బట్టి ప్రమాణము చేయువాడు దేవునినే ఒకసాక్షిగా పిలుచుచున్నాడు. అందువలన అతడు మరింత నిశ్చయముగా తాను చేసిన ప్రమాణమును నెరవేర్చబద్ధుడగును. సొలోమోను యిట్లనుచున్నాడు: "నీవు దేవునికి మ్రొక్కుకొని చెల్లింపకుండుటకంటె మ్రొక్కుకొనకుండుటయే మేలు" (ప్రసంగి 5:4,5). కొందరు నిష్కారణంగా ఒట్టుపెట్టుకొంటారు. అదొక దురలవాటు, కొందరు నోరు విప్పితే అబద్ధాలు చెబుతారు. వారు చెప్పేది నిజమని నమ్మించుటకు నానా ఒట్లుపెట్టుకొంటారు. అట్టిది దేవునికి హేయమైన విషయం. అది దుష్టుని నుండి పుట్టునది యని యేసు ప్రభువు చెప్పారు.

## దేని తోడు అనవద్దు

ఆకాశము తోడని వద్దని ప్రభువు చెప్పారు. ఆకాశము తోడనుటలో నిజానికి దేవుని తోడనిచెప్పుటయే.ఆకాశమను మాట పరలోకాన్ని సూచించుచున్నది. అది దేవుని సింహాసనము. భూమితోడని చెప్పినా, దేవుని తోడన్నట్లే లెక్క; ఏలయనగా భూమి ఆయన పాద పీఠము.'భూమియు దాని సంపూర్ణతయు, లోకమును దాని నివాసులును యెహోవావే" (కీర్తన 24:1). యెరూషలేము తోడన వద్దు అని ఆయన చెప్పారు. యూదులకు అక్కడ దేవాలయమున్నది. అది పరిశుద్ధపట్టణము. "ఒక నది కలదు, దాని కాలువలు దేవుని పట్టణమును, సర్వోన్నతుని మందిరపు పరిశుద్ధ స్థలమును సంతోష పరచుచున్నవి. దేవుడు ఆ పట్టణములో నున్నాడు. దానికి చలనములేదు" అని కీర్తన 46:4-5 లో వ్రాయబడియున్నది. అలాగే తలతోడని ఒట్టుపెట్టుకొనుట కూడ, దేవుని నామమున ఒట్టుపెట్టుకొనుటయే. ఎందుకనగా మానవునికి తన తలపై ఏవిధమైన శక్తియులేదు. మానవునికి జీవము పోయువాడు దేవుడే.

సరిగదా అతని తలలోని ఒక వెంట్రుకను సయితము నలుపుగా గాని తెలుపుగా గాని చేయశక్తిలేనివాడు మానవుడు. నిజానికి దేవుడే మానవుని తలకు జీవమును, ఆ తలను ఎత్తు వానిగాను యున్నాడు (కీర్తన 3:3).

దీనిలో యిమిడి యున్న సూత్రం - ప్రతిదానిలోను మానవుడు దేవుని చూడాలి. సృష్టింపబడిన వాడు సృష్టికర్తకు వేరై యుండలేడు. గనుక దేవుడు సృష్టించిన దేనినైనను సాక్షిగా ఏర్పరచుకొని ఒట్టుపెట్టుకొన్నట్లయితే, దేవుని పై ఒట్టుపెట్టుకొన్నట్లే యని యేసుప్రభువు బోధించారు. అందువలన ఒట్టు పెట్టుకొనుట కంటే మీ మాట అవునంటే అవును, కాదంటే కాదు అని యుండవలెను; వీటికి మించునది దుష్టుని నుండి పుట్టునది అని కొండ మీద చేసిన ప్రసంగములో ప్రభువు బోధించారు. నానావిధములైన ప్రమాణములు చేయుటకంటె సత్యము చాలసులువైనది, సూక్ష్మమైనది. అందువలన మన సంభాషణలో ఎప్పుడు సత్యమునే మనము పలకాలి. అది అవునంటే అవును, కాదంటే కాదన్నట్లుండాలి. అందులో మోసము యేమియు ఉండరాదు. క్రైస్తవుని సంతకం ఎంత విలువో, అతని మాట కూడ అంతే విలువ కలదియై యుండాలి. ఆడినమాట తప్పరాదు. యదార్థ హృదయుడు ఎల్లవేళల సత్యమునే ప్రేమిస్తాడు. అట్టివాని నుండి అతని మాటకంటే ఎక్కువ కోరితే అవమాన పరచినట్లు భావిస్తాడు. అలవాటు చొప్పున అప్రమాణము చేయువాడు పచ్చి అబద్ధికుడు.

## సత్యమే పలకాలి

క్రైస్తవులు యదార్థవర్తనులైయుండాలి. నమ్మకస్థులైయుండాలి. యేసు ప్రభువు దేవుని కుమారుడని నమ్మి, మారు మనస్సు బొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొంది, సంఘారాధనలకు క్రమముగా హాజరయినను

ఒకడు సత్యము పలుకకపోతే, తనమాటను నెరవేర్చకపోతే, చేసిన అప్పులను తీర్చకపోతే అతడు నిత్యనాశనమునకు పోయే ప్రమాదమున్నది. "నేను మీతో చెప్పునదేమనగా - మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతిమాటను గూర్చియు విమర్శదినమున లెక్క చెప్పవలసి యుండును. నీమాటలను బట్టి నీతిమంతుడవని తీర్పునొందుదువు, నీమాటలను బట్టియే అపరాధివని తీర్పు నొందుదువు" అని ప్రభువు చెప్పారు (మత్తయి 12:36).

"మనము ఒకరికొకరము అవయవములైయున్నాము గనుక మీరు అబద్ధమాడుటమాని ప్రతివాడును తనపొరుగు వానితో సత్యమే మాటలాడవలెను' అని అపో. పౌలు వ్రాసాడు (ఎఫెసీ 4:25). గనుక సత్యప్రవర్తన, సత్య సంభాషణ దేవుని యింటి యొద్దనే ఆరంభము కావాలి. "తీర్పుదేవుని ఇంటి యొద్ద ఆరంభమగు కాలము వచ్చియున్నది; అది మన యొద్దనే ఆరంభమైతే దేవుని సువార్తకు అవిధేయులైన వారి గతియేమవును?". (I పేతురు 4:17). అందువలన క్రైస్తవుని సంభాషణ నమ్మదగినదై యుండాలి. అబద్ధము లాడరాదు. ఏలయనగా అబద్ధికులందరు అగ్ని గంధకములతో మండు గుండములో పాలివారవుతారని దేవుని వాక్యము చెప్పుచున్నది (ప్రక 21:8).

మిత్రుడా నీ ప్రవర్తన యెట్లున్నది? నీవు అ ప్రమాణములు చేసి నీ పొరుగు వానిని మోసగించావా? మారు మనస్సు పొందు. నిష్కారణంగా ఒట్టుపెట్టుకొనే అలవాటు కలిగి యున్నావా? మారుమనస్సు పొందు. యేసు ప్రభువును నమ్ముకో; పాపక్షమాపణ నిమిత్తం ఆయన నామమున బాప్తిస్మము పొందు. ఆయన వాక్యాన్ని బట్టి నీ సంభాషణ, నీ ప్రవర్తన అవునంటే, అవును, కాదంటే కాదు అన్నట్లు తీర్చిదిద్దుకో, దేవుడు నిన్ను తప్పక ఆశీర్వదిస్తాడు.

--జాష్షువా గూటం.

# వంచన

## (Deceit)

సిరియారాజు సైన్యాధిపతియైన నయమాను స్వస్థత పొందగోరి షోమ్రోనులోనున్న ప్రవక్తయైన ఎలీషా యొద్దకు బయలుదేరెను. "అతడు ఇరువది మణుగుల వెండియు లక్ష యిరువది వేల రూపాయిల బంగారును పది దుస్తుల బట్టలను తీసికొని పోయి ఇశ్రాయేలు రాజునకు పత్రిక అప్పగించెను". (II రాజులు 5:5). ప్రవక్త ద్వారా రాజునకు అందిన వర్తమానము ప్రకారము నయమాను గుఱ్ఱములతోను రథములతోను వచ్చి ఇంటి ద్వారము ముందర నిలిచెను. అతడు ఎలీషా యిచ్చిన దైవాజ్ఞను ముందు తిరస్కరించినను తరువాత అతని దాసుని ద్వారా ప్రబోధింపబడినవాడై మనసు మార్చుకొని యొర్దాను నదిలో ఏడుమారులు స్నానముచేసి స్వస్థత పొందెను.

"అప్పుడతడు తన పరివారముతో కూడ దైవజనుని యొద్దకు తిరిగి వచ్చి అతని ముందర నిలిచి - చిత్తగించుము..... ఇప్పుడు నీవు నీ దాసుడనైన నాయొద్ద బహుమానము తీసికొనవలసినదని అతనితో చెప్పగా, ఎలీషా - ఎవని సన్నిధిని నేను నిలువబడి యున్నానో, ఇశ్రాయేలు దేవుడైన ఆయెహోవా జీవముతోడు నేనేమియు తీసికొనను అని చెప్పెను. నయమాను అతనిని ఎంతో బతిమాలినను అతడు ఒప్పక పోయెను" (II రాజులు5:16-17). గెహాజీ వాటిని ఆశించి శాపముకొని తెచ్చుకొనెను.

బైబిలునందు అనేక అద్భుత స్వస్థతలను గూర్చి వ్రాయబడెను. క్రీస్తు అపొస్తలులు జరిగించిన అద్భుతముల యొక్క ప్రయోజనం ఏమిటో లేఖనాలు విశదంగా తెలియజేస్తూనే ఉన్నాయి. క్రీస్తు దేవుని కుమారుడని నమ్మునట్లు అవి వ్రాయబడెను (యోహా 20:31). దేవుని వాక్యం స్థిరపరచబడుటకు అపొస్తలులు అద్భుతాలు జరిగించిరి (మార్కు 16:20).

యిక్కడ ఒక ముఖ్య విషయం గమనించాలి. బైబిలు అద్భుతాల్లో ద్రవ్యము యొక్క పాత్ర కనిపించదు. నేడు అద్భుత స్వస్థతలు జరిగించుచున్నామని చెప్పుకొనువారు వారి స్వస్థతా సభల్లో ధనము ఒక ప్రముఖమైన పాత్ర వహిస్తున్నది. ఈ సభల్లో ధనం పోగుచేయుటకు వారు ఏర్పాటు చేసిన భారీ 'హుండీ' లను చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. దేవుని వాక్యం నేడు అద్భుతాలు జరిగించుటకు అనుమతించక పోయినను వారు స్వస్థతా కూటాలను నిర్వహించడం చూస్తే వారి గురి ఏమిటో సత్యాన్వేషి సులభంగా గ్రహించగలడు.

"విశ్వాస సహితమైన ప్రార్థన ఆరోగిని స్వస్థపరచును. ప్రభువు అతనిని లేపును" (యాకో 5:15). నీవు ఆయన బిడ్డవైతే, నీవు విశ్వాసంతో ప్రార్థిస్తే ఆయన వింటానని వాగ్దానం చేయడం జరిగింది. ఇది అద్భుతం కాదు. దైవికమైనది. నీవు ఆయన చిత్తానుసారంగా ప్రార్థించాలి.

ధనార్జనే పరమావధిగా, తమ మనోభావాలను దైవప్రేరితాలని బోధిస్తూ ప్రజలను మభ్యపెట్టి నిత్య దేవుడు జగత్తు పునాది వేయబడక ముందే మానవులకొరకు క్రీస్తు ద్వారా నియమించిన నిత్యసంకల్పానికే స్వార్థప్రయోజనం కోసం లాభప్రాప్తికి అనుగుణంగా మలచుకొంటూ, అక్షయ జీవితం కోసం తడవులాడవలసిన మానవునికి క్షయమైన శరీరసంబంధమైన ఆశలు చూపుట వంచన కాదా?

" నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్యకుమారుడు వచ్చెను" (లూకా 19:10). యిది క్రీస్తు మాట. అట్టి "సిలువ వేయబడిన క్రీస్తును మేము ప్రకటించుచున్నాము." (I కొరింధి 1:23). "యేసుక్రీస్తును అనగా సిలువ వేయబడిన యేసుక్రీస్తును తప్ప మరి దేనిని మీ మధ్య నెరుగకుందునని నిశ్చయించుకొంటిని"(I కొరింథీ 2:2). దేవుని వాక్యం నేర్పిన మాటలతో

సత్యాన్ని మీముందుంచాలనే కోరికతో, మీ ఆత్మలను ప్రభువుచూపిన గమ్యం వైపు నడిపించే ప్రయత్నంలో భాగంగా మోమాటము లేనివారమై అబద్ధమును ఖండించుచున్నాము. "శరీరము ఆత్మకును, ఆత్మ శరీరమునకును విరోధముగా ఆపేక్షించును. ఇవి ఒకదానికొకటి వ్యతిరేకముగా ఉన్నవి" (గలతి 5:17 ). నీవెంత పోషించినను శరీరం నిష్ప్రయోజనమే. నీకు ఆత్మ రక్షణ ప్రాముఖ్యము. అందుకే నీవు విశ్వసించి, మారుమనస్సు పొంది, క్రీస్తును ఒప్పుకొని బాప్తిస్మము పొందుము. నీకేమికావలెనో నీ పరలోకపు తండ్రికి తెలియును (మత్త 6:32).

–E.K.V. ప్రసాదరావు

## నిజమైన ఆరాధన హృదయములో నుండి వచ్చును.

## (True Worship is from the Heart)

దేవుని యెడల నీకు గల ప్రేమానుబంధములను క్రియారూపముగ వ్యక్తపరుచునదియే ఆరాధన. ఆరాధించవలెననెడి నిశ్చయత హృదయమందు కలుగనిచో అసలు దేవుని ఆరాధించుటయే జరుగదు. "ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురు. గాని వారి హృదయము నాకు దూరముగా యున్నది. మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు." అని మత్తయి 15:8-9 లో ప్రభువైన యేసు చెప్పెను.

దేవుని యెడల మనకు గల ప్రేమను, భక్తిని యెట్లు నిరూపించగలము? మనము దేవుని స్తుతించుచు పాడు పాటల ద్వారాను, ఇచ్చుట ద్వారాను, ప్రార్థించుట ద్వారాను, సహవాసములో పాలిభాగస్థుల మగుట ద్వారాను, వినయ భయభక్తులతో బోధింపబడుచున్న వాక్యమును ధ్యానించుట ద్వారాను ఆ ప్రేమను ప్రత్యక్షపరచగలము.

ఈ దిగువ చెప్పబడిన కొన్ని వాక్యములను గమనించుదము:

1. ఒకని నొకడు కీర్తనలతోను, సంగీతములతోను,

ఆత్మసంబంధమైన పాటలతోను హెచ్చరించుచు, మీ హృదయములలో ప్రభువును గూర్చి పాడుచు, కీర్తించుడి (ఎఫెసి 5:19).

2. నీవు యౌవ్వనేచ్ఛల నుండి పారిపొమ్ము. పవిత్ర హృదయులై ప్రభువునకు ప్రార్థన చేయువారితో కూడ నీతిని, విశ్వాసమును, ప్రేమను, సమాధానమును వెంటాడుము. (2 తిమోతి 2:22).

3. సణుగు కొనకయు, బలవంతముగా కాకయు ప్రతివాడును తనహృదయుములో నిశ్చయించుకొనిన ప్రకారము ఇయ్యవలెను; దేవుడు ఉత్సాహముగ ఇచ్చు వానిని ప్రేమించును. (2 కొరింథి 9:7).

4. దానిని విరిచి- ఇది మీ కొరకైన నాశరీరము. నన్ను జ్ఞాపకము చేసి కొనుటకై దీనిని చేయుడని చెప్పెను. ( I కొరింథి 11:24). మనము యెచ్చట జ్ఞాపకము చేసి కొందుము? మన హృదయుములలోనేగదా!

5. నీ పూర్ణ హృదయుముతోను, నీ పూర్ణ ఆత్మతోను, నీ పూర్ణ మనస్సుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెనను నదియే. (మత్తయి 22:37).

పాటల యొక్క భావము, మన పాపములకు పొందిన ప్రాయశ్చిత్తము, వాక్యములో గల అమూల్యము లైనట్టి వాగ్దానములు - వీటన్నిటిని గూర్చి నీహృదయాలోచనలేమైయున్నవి? ఈ ఆరాధన ద్వారా నేను యేమీ పొందలేదని చెప్పెదవా? ఆరాధనకు మూలము, ముఖ్యమునైనది హృదయమేగాని, ఈ లోకసంగతులుకావు.

నీవు ఆరాధించు ఆలయము ఎంత పెద్ద కట్టడమైనను, లేక ఎంత యెక్కువ సంఖ్యలో ఆ యారాధనకు వచ్చినప్పటికిని, లేక ఆ బోధకుడు యెంత గొప్ప ప్రసంగికుడైనను మనము చేసే ఆరాధన మన హృదయముల నుండి చేయునది కాని యెడల అది అంతయు వ్యర్థము. అట్టి ఆరాధనకు ప్రాధాన్యే లేదు. అది దేవునికి అంగీకారము కాదు.

--ఫిలిప్. ఎస్

--------- o ------

# సంక్షిప్త వార్తలు

అక్టోబరు నెల సువార్తికుల సదస్సు 27వ తేదీ శుక్రవారం అమలాపురంలో (జానకిపేట) సహో. బొంతు ధనరాజుగారి ఆధ్వర్యమున ఆశీర్వాదకరముగా జరిగెను. ఆంధ్రప్రదేశ్ లోని వివిధ జిల్లాల నుండి విచ్చేసిన 300 సువార్తికుల సమక్షములో "పరిశుద్ధాత్ముడు నేడు ఎట్లు పనిచేయుచున్నాడు? ఒకడు మార్పు చెందుటలో ఆయన పనియేమి?" అను అంశము చర్చింపబడెను.

సోదరులు బొంతు ధనరాజుగారు, వి. చిన్నయ్యగారు, ఫ్రాన్సిస్ డేవిడ్ గారు (న్యూఢిల్లీ), వి. చిన్నయ్యగారు, యమ్. ప్రసంగిగారు, జాషువా గూటంగారు, చుక్కా అప్పారావు గారు, కె. కుమార్ థామస్‌గారు, ఆర్. సమూయేలుగారు మరియు పాల్ గూటంగారు పై అంశముపై చక్కని వర్తమానముల నందించిరి. సోదరులు ఫ్రాన్సిస్ డేవిడ్‌గారు గొప్ప ఆనందముతో సదస్సులో పాల్గొనుటయే గాక సమయోచితమైన వర్తమానమును పై అంశముపై అందించిరి.

పరిశుద్ధ లేఖనము, పరిశుద్ధాత్ముని పనిని గూర్చి తెలియజేసిన విషయాలను మానవులు గ్రహించక పోవుట వలననే అనేక మతశాఖలు ఆవిర్భవించాయి. బైబిలుయొక్క ప్రారంభ వచనాలలోనే (ఆది1:1-2) పరిశుద్ధాత్ముని ప్రస్తావన కనబడుచున్నది. ఆయన ఒక వ్యక్తి(యోహా 16:13), ఆయన సత్యస్వరూపి, ఆదరణకర్త (యోహా 15:26) ఉత్తర వాది(యోహా14:16). అపొస్తలులను దేవుని వాగ్దానమైన పరిశుద్ధాత్మ కొరకు కనిపెట్టుడని క్రీస్తు ఆజ్ఞాపించెను (అ.కా. 1:4-5). పెంతెకొస్తు పండుగ దినమున వారు పరిశుద్ధాత్మనుపొంది అన్యభాషలు మాట్లాడిరి. అన్యభాషలు మాటలాడుట వలననే సర్వలోకమునకు అపొస్తలులు సువార్త ప్రకటించగలిగిరి (కొలస్స 1:23). ఈ ఆత్మవరము లేనియెడల వారు వివిధ భాషలు మాటలాడుట అసాధ్యము. దేవుడు మానవుని ఒక అద్భుతము చేసి సృజించెను. అతని సంతానము అభివృద్ధి చేయుటకు అద్భుతము అవసరం లేకపోయింది. ప్రకృతి ధర్మము ద్వారా

మిగిలిన పని జరిగించెను. సంఘముయొక్క ప్రారంభము (పెంతెకొస్తు దినమున) అద్భుతముతోనే జరిగెను. యెరూషలేములోని సంఘము వివిధ పట్టణములకు విస్తరించుటకు అద్భుతము అవసరం లేకపోయింది. మన జీవమునకును, భక్తికిని కావలసిన వాటన్నిటిని పరిశుద్ధాత్ముడు వాక్యమునందు పొందుపరచెను.

దేవుని వాక్యమును చదివినప్పుడు వాక్యమునకు విధేయులమైనప్పుడు పరిశుద్ధాత్ముడు క్రైస్తవునిలో జీవించును. యిది మనలో నివసించు ఆత్మ (2 తిమో 1:14). నేడు పరిశుద్ధాత్ముడు అద్భుతరీతిగా కాదు గాని వాక్యముద్వారా పనిచేయుచున్నాడు. ప్రకటన ఆఖరి అధ్యాయములోకూడ ఆత్మయొక్క ప్రస్తావన కనబడుచున్నది (ప్రక 22:17). వాక్యము పరిశుద్ధాత్మ ప్రేరిత లేఖనమని మరువకము.

సోదరులు బొంతు ధనరాజుగారు చక్కని ఏర్పాట్లుచేసి సదస్సును ఘనంగా నిర్వహించిరి.

---

Regd. No. R/KD—45/KD H.O.
Date of Posting i 15th of Every month

From
SATYA WAKKU
P.O. Bov 80
KAKINADA 533 001

No.

To.